ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎం: 9985411154



ఏఎంసీలో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక అవస్థలు పడుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు

ఆస్పత్రిలో నరకం..!





▲ ఎఫ్‌ఎం వార్డు పక్కనున్న ఐసీయూలో ఉక్కపోతతో అల్లాడిపోతున్న రోగులు.. ఫ్యాన్లు ఉన్నా.. తిరిగితే ఒట్టు..

పనిచేయని ఏసీలు..
తిరగని ఫ్యాన్లు..
అత్యవసర విభాగాల్లోనూ అంతే..
ఉక్కపోతతో రోగులు విలవిల..
చిన్నపిల్లలు, బాలింతలపైనా దయ లేదా..?
మరమ్మతులు పట్టని అధికారులు

ఐసీయూలో..
ఏసీలు పనిచేయవు..
ప్రసవాలు, పసివాళ్ల వార్డుల్లో..
ఫ్యాన్లు తిరగవు..
అన్ని వార్డుల్లో అంతే..
అదే దౌర్భాగ్యమే..

ఉక్కపోతతో..
ప్రాణాపాయంతో ఉన్న రోగులు
విలవిల్లాడుతున్నారు..
గర్భిణులు, బాలింతలు,
పసిపిల్లలు..
ఊపిరి అందక
ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు..

అక్కడే.. అను నిత్యం..
ఆస్పత్రి అధికారులు
తిరుగుతారు..
అయినా.. పట్టించుకోరు..
బాలింతలు విలవిల్లాడుతున్నా..
కనీసం స్పందించరు..
వారు వైద్యాధికారులో..
మరమనుషులో..!

అనంతపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అసలే ఎండాకాలం. ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం అయ్యిందంటే జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇళ్లలో ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. అలాంటిది ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి కనీసం ఫ్యాన్లు, ఏసీలు పనిచేయకపోతే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి గదిలో ఫ్యాన్లు కనిపిస్తున్నాయి. ఎమర్జెన్సీ విభాగాల్లో ఏసీలతోపాటు ఫ్యాన్లూ ఉంటున్నాయి. ఏసీలు పనిచేయడంలేదు. ఫ్యాన్లు తిగడం లేదు. అనేకచోట్ల అవి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో రోగులు ఆస్పత్రిలో ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

వందల సంఖ్యలో..



వార్డులో విలవిల్లాడుతున్న పిల్లలు

సర్వజనాస్పత్రి జిల్లాకు పెద్ద దిక్కు. రోజూ 2 వేల మంది చికిత్సకోసం వచ్చివెళ్తున్నారు. 1200 మందికిపైగానే వివిధ సమస్యలతో అడ్మిషన్‌లో ఉంటారు. అలాంటి ఆస్పత్రిలో వైద్యం దేవుడికెరుక, వారికి కనీస వసతులు కల్పించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. చిన్నచిన్న సమస్యలు కూడా తీర్చలేక రోగులజీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో కలిపి 400 ఏసీలున్నాయని చూపుతున్నారు. వారు చెబుతున్న మేరకే దాదాపు 200 ఏసీలు పనిచేయడం లేదు. 2వేలకుపైగా ఫ్యాన్లు ఉన్నా.. వాటిలో సగభాగం తిరగడంలేదు. కొన్ని ఏసీలు పనిచేసినా, ఫ్యాన్లు తిరిగినా వాటి నుంచి గాలి కూడా రావడంలేదని వైద్యవర్గాలే అంటున్నాయి. వీటిని బట్టి చూస్తే జిల్లా ఆస్పత్రిలో ఎంతటి దుర్భర పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఉక్కపోతతో విలవిల

సర్వజనాస్పత్రి క్యాజువాలిటీ, ఏఎంసీ, ఐసీయూల్లో విషమ పరిస్థితి రోగులు చికిత్స పొందుతుంటారు. అక్కడున్న ఏసీలు, ఫ్యాన్లు పనిచేయకపోవడంతో వారు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బాలింతలు, చిన్న పిల్లల వార్డుల్లో చికిత్స పొందుతున్న వారు అల్లాడిపోతున్నారు. దాదాపు అన్ని విభాగాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి.


అధికారుల బాధ్యతారాహిత్యం

జిల్లా ఆస్పత్రిలో అధికారుల బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఆస్పత్రికి అధికంగా నిధులు వస్తుంటాయి. ఎన్టీఆర్ వైద్యసేవ నిధులను కూడా ఆస్పత్రి నిర్వహణకు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. కలెక్టర్ ద్వారా ఆస్పత్రి అభివృద్ధి నిధులు తెప్పించుకోవచ్చు. వాటిని మౌలిక వసతుల కల్పన, కనీస అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుం ది. ఇపుడు ఎండాకాలం కావడంతో ఈ సీజన్ వచ్చే సమయానికే రోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, పనిచేయని ఏసీలు, ఫ్యాన్లను మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. ఇదంతా సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాల్సి ఉంటుంది. కనీసం ఏసీలు, ఫ్యాన్ల మరమ్మతుల గురించి కూడా పట్టించుకోవట్లేదు. దీనిని బట్టి రోగుల పట్ల వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. వారి బాధ్యతారాహిత్యం వల్ల రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీస వసతుల కల్పనకు కృషి చేయాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

ఎండాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్ల మరమ్మతులపై దృష్టి పెట్టాం. ఆస్పత్రిలో ఎన్ని ఏసీలు, ఫ్యాన్లు ఉన్నాయి, ఏయే విభాగాల్లో అవి పనిచేయడం లేదో వివరాలు తెప్పించుకున్నాం. వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఏపీఎంఐడీసీ ఇంజనీర్లకు పంపించాం. త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- మల్లికార్జునరెడ్డి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్





కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి నారా లోకేశ్

హాజరైన మంత్రి అనగాని సత్యప్రసాద్

కదిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేశ్ పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీమహావిష్ణువు స్వరూపుడైన ఖాద్రీశుడి కల్యాణోత్సవాన్ని సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని, ముక్కోటి దేవతలు వీక్షిస్తారని భక్తుల విశ్వాసం. కల్యాణాన్ని కన్నులారా వీక్షిస్తే సకల పాపహరణం జరుగుతుందని నమ్ముతారు. యాగశాలలో కొలువుదీరిన వధువులు శ్రీదేవి, భూదేవిని, వరుడు శ్రీవారిని వేర్వేరుగా పల్లకిలలో కల్యాణ మంటపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు సోమవారం రాత్రి 10.07 గంటలకు మాంగళ్య ధారణ గావించారు. కల్యాణోత్సవం ముగిసిన తరువాత శ్రీవారు, అమ్మవార్లపై నుంచి జాలువారిన ముత్యాల తలంబ్రాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఈ వేడుకను తిలకించారు. కల్యాణోత్సవం తరువాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి భక్తులు కానుకలను చదివించుకున్నారు. వేడుకలలో దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈఓ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, అర్చకులు, ఆయల సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరపున..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేశ్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ముఖద్వారం నుంచి నారా లోకేశ్ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి సమర్పించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించి, వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. వేదపండితులు వసంత వల్లభుడికి నారా లోకేశ్‌తో సంకల్పం చేయించారు. ఆయన వెంట రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

(మిగతా 6వ పేజీలో..)



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళుతున్న నారా లోకేశ్

వన్ సర్వే, వన్ ఈ-ఫైల్ అమలు చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్య పరిష్కారం కోసం జిల్లాలో వన్ సర్వేనెంబరు, వన్‌ఈ-ఫైల్ విధానం అమలు చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 417మంది తమ సమస్యలను వినతులు రూపంలో అందజేశారు. కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, మన పనితీరును బట్టి సీఎం చంద్రబాబునాయుడు ర్యాంకులు ఇస్తారన్నారు. జిల్లా స్థాయి అధికారులువారానికి రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యాలయాలు పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలు వారానికి ఒక తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి, రెవెన్యూ సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులందరూ బాధ్యతగా పని చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్, డ్వామాపీడీ సలీమ్‌బాష, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, డీఆర్‌ఓ ఇతర అధికారులు

బాధ్యతలు స్వీకరించిన పీడీ



బాధ్యతలు తీసుకున్న పీడీ నాగమణి

అనంతపురం విద్య, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీగా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం ప్రాజెక్టు సీడీపీఓగా పనిచేస్తున్న నాగమణిని ఉద్యోగోన్నతిపై జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఉద్యోగులు, సంఘాల నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



రంజాన్ వేళలు	ఇఫ్తార్	సెహరీ
	6.31	5.13
	మంగళవారం సాయంత్రం	బుధవారం ఉదయం



ఉష్ణోగ్రతలు సోమవారం	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	19.0

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ రకాల పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో సోమవారం ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద జిల్లాలో 1901 సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికి 210 పనులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సీసీ డ్రెయిన్లు 470 మంజూరు కాగా 288పనులు, పశువుల షెడ్లు 1737మంజూరుకాగా 492పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెయ్యి ఎకరాలలో పశుగ్రాసం పెంచాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లను వారంలోపు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు, అమృత్ సరోవర్ పనులు పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజు బయోమెట్రిక్ హాజరు వేయాలని, ఎంఎస్‌ఎంఈ సర్వే, పీ-4 సర్వే పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు.

శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానము
కసాపురము గ్రా. గుంతకల్లు (మం.), అనంతపురము జిల్లా.

ఆర్.సి.నెం. E/146/2025, ఇ-టెండరు-సీల్డు టెండరు-బహిరంగ వేలము ప్రకటన తేది:10.03.2025 (3rd Call)

శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానము, కసాపురము (గ్రా.), గుంతకల్లు (మ.), అనంతపురము జిల్లా హక్కు భుక్తములోని క్రింద తెలిపిన బటములకు అనగా నెం.1 నుండి 6 వరకు ఇ-టెండరు, సీల్డు టెండరు & బహిరంగ వేలములు, వ.నెం.7 నుండి 8 లకు ఇ-టెండరు సీల్డుటెండరు వ.నెం.9 నుండి 10 వరకు సీల్డు టెండరు మాత్రమే నిర్వహించబడును.

క్ర.సం.	టెండరు వివరము	కాలపరిమితి	ధరావత్తు రూ.
1.	తలనీలాలు ప్రోగు చేసుకొను లైసెన్స్ హక్కు	01.04.2025 to 31.03.2026	50,00,000/-
2.	ఆలయ పరిసర ప్రాంతములలో దాపలు (హ్యాట్) & బెడ్ షీట్స్ అద్దెకిచ్చు లైసెన్స్ హక్కు	-do-	3,00,000/-
3.	పాదరక్షలు భద్రపరచి నిర్ణీత రుసుము వసూలు చేసుకొను లైసెన్స్ హక్కు	-do-	50,000/-
4.	[illegible] మరియు వసతి గదులు వద్ద భక్తులకు వేడినీరు అమ్ముకొను లైసెన్స్ హక్కు	-do-	10,000/-
5.	మరుగు దొడ్లు నిర్వహణ చేయుచూ నిర్ణీత రుసుము వసూలు చేసుకొను లైసెన్స్ హక్కు	-do-	50,000/-
6.	50" x 50" అడుగుల ఖాళీ స్థలములో క్యాంటీన్ నిర్వహించుకొనుట	01.04.2025 to 31.03.2028	2,00,000/-
7.	ఉగాది-2025 మహోత్సవముల సందర్భముగా ఆలయ కట్టడములకు పేయింటింగ్ పనులు	Before 27.03.2025	17,500/-
8.	ఉగాది-2025 మహోత్సవముల సందర్భముగా ఎలక్ట్రిఫికేషన్ పనులు	Before 27.03.2025	8,750/-
9.	ఎ.సి.లు & గీజర్స్ ఎ.ఎమ్.సి. చేయుట	-do-	5,000/-
10.	సిసి కెమెరాలు ఎ.ఎమ్.సి. చేయుట	-do-	5,000/-

గమనిక: హెచ్చుపాట దారులు బిడ్ మొత్తములను నిబంధనలలో తెలిపిన ప్రకారం చెల్లించవలసి యుండును.
- తేది. 15.03.2025 ఉ.9-00 గం.ల నుండి తేది.16.03.2025 సా.6.00 గంటల లోపు షెడ్యూలు పొందవచ్చును.
- సీల్డు టెండరు షెడ్యూళ్లను తేది.17.03.2025 కార్యాలయము నందు ఉంచు టెండరు బాక్స్ నందు ఉ.11:00 లోపు దాఖలు చేయవలెను.
- On line Tender documents download start dt.12.03.2025 @10:00 AM end date: 17.03.2025@11:00 PM.
- Technical bed will open on 17.03.2025 after 12.00 P.M. And Price bid will open on 17.03.2025 after 5-00 P.M.
- ఇ-ప్రొక్యూర్‌మెంట్ (ఆన్‌లైన్) టెండర్ల నందు పాల్గొనదలచిన వారు www.tender.apeprocurement.gov.in సంప్రదించవచ్చును.
- వ.నెం.1 నుండి 6 వరకు తెలిపిన బటములకు బహిరంగవేలములు తేది.17.03.2025న దేవస్థానము కార్యాలయము నందు ఉ.10:00గం.ల నుండి ప్రారంభముగును మరియు ఇతర వివరములకు దేవస్థానము కార్యాలయ ఫోను నెం.9491000655, 9441053005, 9441052069 ద్వారా సంప్రదించవచ్చును.

కె. సుగుణమ్మ, అనువంశిక ధర్మకర్త   సం/- కె.వాణి, ఉపకమీషనరు & కార్యనిర్వహణాధికారి

గిట్టుబాటు ధర కల్పించాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

ముగిసిన రైతు సంఘం పాదయాత్ర

అనంతపురం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న ఉరవకొండ నుంచి ప్రారంభించిన రైతుల పాదయాత్ర సోమవారం అనంతపురంలో ముగిసింది. నడిమివంక, క్లాక్‌టవర్ మీదుగా కలెక్టరేట్ వరకు వీరి పాదయాత్ర సాగింది. కలెక్టరేట్ ఎదుట పాడైపోయిన మిరపను పోసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో పప్పుశనగ సుమారు 57వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. అయితే అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.20వేలు పంటనష్ట పరిహారమందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, ప్రకాష్‌రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు సావిత్రి, శివారెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రైతుసంఘం నాయకులు




సాగు నీరు కట్టిన అనంతరం పచ్చగా మారిన మిరప పొలం

జీబీసీ ప్రధాన కాలువలో ఎక్కడా ఏ రైతు కూడా అడ్డు కట్టలు వేయకుండా కింది వరకూ సాగు నీరు వెళ్లాలని ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్లలో కాలువపై గస్తీ నిర్వహించారు. ప్రతీ రైతుకు సాగు నీరు అందాలని కోరుతూ పెద్ద పెద్ద మోటార్లతో కూడా సాగు నీరు తోడుకో రాదు అంటూ ప్రచారం నిర్వహించారు. వారం రోజులుగా మండలంలో జీబీసీకి సాగు నీరు వస్తూ ఉండటంతో

చివరి ఆయకట్టు రైతుల గస్తీ

మిరప చేలు కళకళలాడు తున్నాయి. కాలువలో 250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో పంటకు పూర్తి స్థాయిలో నీరు అందుతోంది. వైసీపీ పాలనలో 2023లో నవంబరు నెలలో సాగు నీరు బంద్ కావటంతో అప్పట్లో మిరప రైతులు సాగు నీరు కోసం రెండు నెలలు పాటు ధర్నాలు రాస్తా రోకో చేశారు. అయినా వైసీపీ నేతలు నాయకులు కనీసం ఒక్క తడి నీరు ఇవ్వలేదు. ఈ సారి మాత్రం మార్చిలో కూడా సాగు నీరు రావటం ఇది కూటమి ప్రభుత్వం చొరవ అనే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జీబీసీలో ప్రవహిస్తున్న సాగు నీరు

సాగు నీరు కట్టిన అనంతరం ఎర్రగా మారిన మిరప కాయలు

మిరప సొళ్లలో నీరు పారుతున్న దృశ్యం

జీబీసీ రైతుల ఆశలకు కూటమి ప్రభుత్వం ప్రాణం పోసింది. మిరప పంట చివరి దశలో ఉన్న సమయంలో నీటి సరఫరా ఆగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. పంట దెబ్బతిని, తీవ్రంగా నష్టపోతామని మథనపడ్డారు. ఇదే విషయాన్ని ఉరవకొండ నియోజక వర్గంలోని రైతులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. నీరు ఇప్పించాలని విన్నవించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం అధికారులతో చర్చించి సాగు నీరు విడుదల చేయించింది. జీబీసీకి వారం రోజులుగా సాగు నీరు వస్తుండటంతో వివిధ గ్రామాల్లోని రైతులు మిరప పంటకు తిప్పుకుని పంటలను కాపాడుకుంటున్నారు. - ఆంధ్రజ్యోతి, విడపనకల్లు

రంగు ఎక్కుతున్న మిరప కాయలు

సంబరపడుతున్న జీబీసీ ఆయకట్టు రైతులు

హమ్మయ్యా

చివరి దశలో మిరప పంటకు అందిన నీరు


సాగు నీరు లేక తెల్లగా మారిన మిరప కాయలు

సంతోషంగా ఉంది



నేను 8 ఎకరాల్లో డబ్బీ రకం మిరప పంటను సాగు చేశా. కాపు ఆలస్యం కావటంతో సాగు నీరు లేక మిరప కాయలు రంగు రాకుండా పోయే పరిస్థితి వచ్చింది. అయితే చివరి దశలో జీబీసీకి నీరు రావటంతో పంటకు నీరు అందించా. దీంతో కాయలు కూడా ఎర్రగా మారాయి. గత ప్రభుత్వంలో సాగు నీటి కోసం రోడ్లెక్కి ధర్నాలు, రాస్తా రోకోలు చేసినా చుక్క నీరు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం మంత్రి పయ్యావులు కేశవ్ చొరవతో జీబీసీ రైతులకు సాగు నీరు అందించి ఆదుకుంది. కాయలు ఎర్రరంగు రావాలంటే చివరి దశలో సాగు నీరు చాలా అవసరం. సకాలంలో సాగు నీరు అందించి మిరప కాయలు మంచి రంగు వచ్చేలా చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-జనార్దననాయుడు, జనార్దనపల్లి

పూర్తిగా నష్టపోయేవాళ్లం



నేను 6 ఎకరాల్లో డబ్బీ రకం మిరప సాగు చేశా. జూన్‌లో సాగు చేయగా కాపు ఆలస్యం అయ్యింది. కాయలు రంగు మారే సమయంలో నీరు లేక తెల్లగా మారే పరిస్థితి వచ్చింది. చివరి దశలో సాగు నీరు రావటంతో పంటకు తడులు అందిస్తున్నా. కొంత వరకూ కాయలు రంగు మారుతున్నాయి. ఎర్రగా ఉంటే మంచి ధరలు పలుకుతాయి. చివరి దశలో సాగు నీరు లేక పోయింటే మా పరిస్థితి దిక్కు తోచకుండా ఉండేది. గత ఏడాది సాగు నీరు లేక లక్షల్లో నష్ట పోయాము. కూటమి ప్రభుత్వం, మంత్రి పయ్యావుల మిరప రైతులకు ప్రాణం పోశారు. -బోయ రాజు, జనార్దనపల్లి

రంగు ఉండేది కాదు



పంట చివరి దశలో ఉన్న సమయంలో నీరు లేక కాయల రంగు తగ్గింది. నేను 8 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఒక్క తడి నీరు రావటంతో మిరప రైతులకు ప్రాణం లేచి వచ్చినట్లు అయ్యింది. నీళ్ల లేక పంటలు ఎండి పోతున్న సమయంలో సాగు నీరు వచ్చింది. ఈ ఎండలకు మిరప పంటలకు సాగు నీరు కడుతూ ఉండటంతో పంటలు పచ్చగా మారి కాయలు మంచి రంగు ఎక్కుతున్నాయి. ఎర్రగా ఉన్న మిరప కాయలకు మంచి ధర వస్తుంది. చివరి దశలో సాగు నీరు లేక పోయింటే రంగు ఉండేది కాదు,దిగు బడి వచ్చేది కాదు.

-నరేష్, ధర్మపురి

పంట నష్టం అంచనా

తాడిమర్రి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అదానీ ప్రాజెక్టు నిర్మాణ పనుల కారణంగా పంటలకు జరుగున్న నష్టాన్ని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దుమ్ము కారణంగా తాము పంటలను నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు దిగడంతో స్పందించిన అధికారులు, సోమవారం మండలంలో పర్యటించారు. తహసీల్దార్ భాస్కర్ రెడ్డి సూచనల మేరకు దాడితోట రైతులతో ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరి మాట్లాడి, పంటల వివరాలను తెలుసుకున్నారు. పంట నష్టంపై ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారికి నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు. వీఆర్‌ఓ సావిత్రి, వీహెచ్‌ఏ రామాంజినేయులు, గొట్లూరు వీహెచ్‌ఏ చరిత్, వీఆర్‌ఏ రాజశేఖర్, సూరి తదితరులు పాల్గొన్నారు.


పండ్లతోటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి

కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



అభిమానులతో నారా లోకేశ్ కరచాలనం

(5వ పేజీ తరువాయి)

తదితరులు ఉన్నారు. పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన లోకేశ్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణోత్సవానికి విజయవాడ నుంచి ఆయన ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ముదిగుబ్బ మీదుగా కదిరికి రోడ్డు మార్గాన చేరుకున్నారు. గ్రామాల్లో అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం లభించింది. కల్యాణోత్సవం అనంతరం ఆయన కడప ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి నుంచి కదిరి వరకూ అడుగడుగునా ప్రజలు నీరాంజనలు పట్టారు. బాణ సంచా పేలుస్తూ, పూలవర్షం కురిపించారు. లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. అక్కడక్కడ వాహనాన్ని ఆపుతూ లోకేశ్ వారితో మాట్లాడారు. సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు


చిన్నారికి ముద్దుపెడుతూ...

చిత్తశుద్ధితో అర్జీల పరిష్కారం: కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 218 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన జరిగే అనర్థాలను ఈనెల 15న జరిగే కార్యక్రమంలో ప్రజలకు తెలియ జేయాలన్నారు. అన్నిశాఖల హెచ్‌ఓడీలు, గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీసీహెచ్‌ఓ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, ల్యాండ్ సర్వే ఏడీ విజయ శాంతి, మత్స్యశాఖ చంద్రశేఖర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ శివరంగప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, గ్రామ సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీ ఫోర్‌లో భాగస్వాములు కండి

సమాజంలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న పీ ఫోర్ విధానంలో దాతలు, సంపన్నవర్గాలు, ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశం భవనంలో పీఫోర్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. వచ్చే ఉగాది నుంచి ప్రభుత్వం ఈవిధానానికి శ్రీకారం చుట్టనుందన్నారు. ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈవిధానం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరగుని భయం

ధాన్యం అమ్మకాల్లో రైతులకు తరుగు భయం

క్వింటా ధాన్యంపై 6 నుంచి 8 కిలోల నష్టం

చేతివాటం చూపిస్తున్న వ్యాపారులు

కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోతున్న అన్నదాతలు

యల్లనూరు/పుట్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టలు పడి రైతులు పండించిన పంటను వ్యాపారులు తరుగు పేరుతో దోచేస్తున్నారు. అరకొరగా వచ్చిన దిగుబడిని ఇష్టానుసారంగా తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఏ పంటలోనూ నాణ్యమైన దిగుబడులు రావడం లేదు. ఇదే అదనుగా వ్యాపారులు క్వింటా ధాన్యంపై అదనంగా 6 నుంచి 8 కిలోలు తరుగు పేరుతో తీసుకుంటున్నారు. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో వేరుశనగ, పప్పుశనగ, కంది, మొక్కజొన్న, జొన్న, మిను వ ుు, కొర్రలు పంటలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మెట్టపొలాలు ఉండటం, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ధాన్యపు గింజల నాణ్యతలో తేడాలు వస్తుంటాయి. దీని ఆధారంగా కొందరు వ్యాపారులు గింజల్లో నాణ్యతలేదు, రంగుమారింది, నల్లమచ్చలు ఏర్పడ్డాయి, తేమశాతం ఎక్కువగా ఉందంటూ తరుగు తీస్తున్నారు.

ధర తగ్గించకుండానే దోపిడీ

ఈ ఏడాది పుట్లూరు మండలంలో కోత సమయంలో కురిసిన వర్షాలకు పప్పుగింజల్లో నల్లని మచ్చలు ఏర్పడ్డాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు క్వింటాపై ధర తగ్గించకుండా 8నుంచి 10కేజీల వరకు అదనంగా దిగుబడి తీసుకున్నారు. పప్పుశనగను ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు తరుగు ఎక్కువగా తీసుకోవడానికి జంకేవారు. గత మూడేళ్ల నుంచి ఈ మండలాల్లో ప్రభుత్వం అరకొరగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారుల ఆగడాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా కంది, మొక్కజొన్న విక్రయంలో కూడా వ్యాపారులు చెప్పిందే రేటు. ధర పెట్టడం ఒక ఎత్తయితే తరుగు తీసుకోవడం మరో రకంగా ఉంది.

ఉదాహరణకు పప్పుశనగ క్వింటాకు రూ.5800 ధర పెడుతూ సరాసరిన క్వింటాకు 5కిలోల తరుగు తీసుకున్నా కిలో రూ.58ప్రకారం రూ.290 రైతు కోల్పోతున్నాడు. అలాగే కందులు క్వింటా ధర రూ.7750 ఉంది. ఈ పంటపై 6 కిలోలకు పైగా తరుగు తీస్తున్నారు. క్వింటా ధాన్యంలో తరుగు కిలో రూ.77.50 ప్రకారం ఆరు కిలోలపై రూ.465 కోల్పోతున్నారు. పది క్వింటాళ్లు పండించిన చిన్న, సన్నకారు రైతులు కూడా ఈ లెక్కన రూ.3వేల నుంచి 5వేల వరకు నష్టపోతున్నారు.


50కిలోల కంది బస్తాపై అదనంగా 3కిలోలు ఉన్న దృశ్యం


కొనుగోలు కేంద్రాలు లేక..

యల్లనూరు మండలంలో గత మూడేళ్ల నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధాన్యం కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్లూరు మండలంలో అడపాదడపా పప్పుశనగ, కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు మూడు రోజులకే మూసివేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో రైతులు ధాన్యం విక్రయించడానికి వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

జల్లెడ పట్టలేదని..

గతంలో క్వింటా బస్తాతో తూకం వేసేవారు. దీనిపై కేజీ మాత్రమే తరుగు తీసేవారు. ధాన్యంలో ఎక్కడైనా మట్టి, రాళ్లు ఉన్నట్లయితే జల్లెడ పట్టేవారు. ఆ తర్వాత తరుగు లేకుండా తూకం వేసుకొనేవారు. కానీ గత రెండు మూడేళ్ల నుంచి జల్లెడ పట్టే పద్ధతికి స్వస్తిచెప్పి తమ చేతివాటానికి వ్యాపారులు తెరలేపారు. జల్లెడ పట్టలేదు కదా బస్తాపై ఎన్ని కేజీలు ఇస్తారంటూ రైతులతో బేరసారాలకు దిగుతున్నారు. అంతేకాకుండా గతంలో వందకేజీల బస్తాకు బదులు ప్రస్తుతం 50కేజీల బస్తానే ఎంచుకొని రైతులను మరింత దగా చేస్తున్నారు. 50కేజీల బస్తాపై ధాన్యాన్ని బట్టి 3కేజీల నుంచి 4కేజీల వరకు ఇలా క్వింటాపై 6నుంచి 8కేజీల వరకు తరుగు పేరుతో ధాన్యాన్ని అదనంగా తీసుకువెళుతున్నారు.

గతంలో కేజీనే..



గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం పప్పుశనగ కొనుగోలులో తరుగు అంటూ వ్యాపారులు ఎక్కువగా ధాన్యాన్ని తీసుకుంటున్నారు. గతంలో క్వింటా బస్తాపై కేజీ సంచి తూకం, ఒక కేజీ తరుగు తీసుకొనేవారు. ఈ ఏడాది తరుగు 4కేజీలకు పైగా తీసుకుంటున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

- ఆదిశేషులనాయుడు, పప్పుశనగ రైతు

ప్రభుత్వమే కొనాలి



రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయా లి. పప్పుశనగకు మచ్చలు ఎక్కువ ఉన్నాయని క్వింటాపై 6 కిలోల తరుగు అడుగుతున్నారు. ఇప్పటికే రైతులకు తక్కువ దిగుబడులు వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీరడం లేదు. ప్రభుత్వం స్పందించి ధర పెంచి, తరుగు లేకుండా కొనుగోలు చేయాలి.

-రామాంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు

దేవతలారా.. రండి..!

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం... శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

కదిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ.. వేద మంత్రోచ్చారణల నడుమ గరుడుడి చిత్రపటాన్ని ధ్వజస్థంభంపై ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన తరువాత ధ్వజ పతాకాన్ని అవరోహణం చేస్తారు. వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు మంగవారం హంసవాహనంపై దర్శనమిస్తారు. తిరువీధుల్లో స్వామి వారు ఊరేగుతారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు తరలివస్తారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు


ఎమ్మెల్యే కందికుంటను ఆశీర్వదిస్తున్న అర్చకులు

లక్ష్యం దిశగా..

ఫీజు వసూళ్లలో మార్కెట్ కమిటీల ముందడుగు

- రూ.12.06కోట్లకు.. రూ.9.97 కోట్లు వసూలు
- టార్గెట్ పూర్తి చేసిన రాయదుర్గం కమిటీ

అనంతపురంరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో లక్ష్యం వైపు సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతుండటంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు టార్గెట్ల సాధనకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని రెండు మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన అన్ని కమిటీలు లక్ష్యం వైపులు అడుగులు వేస్తున్నాయి. ఇందులో ఇప్పటికే రాయదుర్గం మార్కెట్ కమిటీ లక్ష్యాన్ని పూర్తి చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మార్కెటింగ్ శాఖకు 12.06కోట్ల మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని సంబంధి త శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఫిబ్రవరి ఆఖరికి



అనంతపురం మార్కెట్ యార్డు


మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం

రూ.9.97కోట్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈనెల ఆఖరుకు ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో అధికారులు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

రెండు మినహా...

జిల్లాలో తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో రాప్తాడు, ఉరవకొండ మార్కెట్ కమిటీలు మినహా మిగిలినవి లక్ష్య సాధనలో ముందున్నాయి. రాయదుర్గం మార్కెట్ కమిటీ ఫిబ్రవరి ఆఖరుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ కమిటీకి రూ.1.44కోట్లు టార్గెట్ కాగా..1.46కోట్లు వసూలు చేసింది. ఆ తరువాత స్థానంలో శింగనమల, తాడిపత్రి కమిటీలున్నాయి. వీటి తరువాత అనంతపురం, గుత్తి , గుంతకల్లు, కళ్యాణదుర్గం కమిటీలున్నాయి. చివరి రెండు స్థానాల్లో ఉరవకొండ, రాప్తాడు కమిటీలున్నాయి. రాప్తాడు మార్కెట్ కమిటీ గత ఏడాది లక్ష్యం పూర్తి చేయడంలో పోటీ పడ్డా ఈఏడాది మాత్రం చతికిలపడింది. ఆ కమిటికీ రూ.53లక్షలు టార్గెట్ కాగా రూ.20.73లక్షలు మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.41లక్షలు వసూలు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉరవకొండ పరిస్థితి ఇలానే ఉంది. రూ.90లక్షలకు గాను..51.27లక్షల వసూలు మాత్రమే రాబట్టారు. గత ఆర్థిక సంవత్సరం(2023-24), ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కమిటీ లక్ష్యం రూ.10లక్షలకుపైగా వెనుకబడి ఉండటం గమనార్హం.

మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాల వివరాలు ఇలా..

మార్కెట్ కమిటీ	లక్ష్యం రూపాయల్లో..	ఫిబ్రవరి ఆఖరుకు వసూలైంది (రూపాయల్లో..)
అనంతపురం	4.60కోట్లు	3.86కోట్లు
గుత్తి	29లక్షలు	23.92లక్షలు
గుంతకల్లు	65లక్షలు	50.47లక్షలు
కళ్యాణదుర్గం	61లక్షలు	43.24లక్షలు
రాప్తాడు	53లక్షలు	20.73లక్షలు
రాయదుర్గం	1.44కోటు	1.46కోట్లు
శింగనమల	1.02కోట్లు	92.86లక్షలు
తాడిపత్రి	2.02కోట్లు	1.81కోట్లు
ఉరవకొండ	90లక్షలు	51.27లక్షలు
మొత్తం	12.06కోట్లు	9.97కోట్లు

85 శాతం పూర్తి చేశాం

నిర్దేశిత లక్ష్యంలో 85శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాం. మిగిలిన టార్గెట్లు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈనెల ఆఖరి వరకు సమయం ఉంది. రాప్తాడు రైస్ మిల్లు బంద్ కావడంతో టార్గెట్ పరంగా వెనుకబడింది. ఇక ఉరవకొండ కమిటీ పరిధిలోను ఎండు మిర్చికి ధరలేకపోవడం కొంత వరకు కమిటీ లక్ష్యంపై పడింది. ఈనెల చివరిలోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేస్తాం.

- సత్యనారాయణ చౌదరి, ఏడీ, మార్కెటింగ్ శాఖ

న్యూస్ బాక్స్

బీసీల అభివృద్ధే చంద్రబాబు శ్వాస

- అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హిందూపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వాస అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా బీసీల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. అసెంబ్లీలో సోమవారం మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభివృద్ధికి ఎన్నడూలేనంతగా బడ్జెట్‌లో రూ.33,878.45 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి ధన్యవాదాలు అన్నారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పథకాల అమలు చేస్తున్నామన్నారు. సీఎస్ సహా కీలక పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. బీసీ పిల్లల విద్య కోసం అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో మెగా డీఎస్సీ నెటిఫికేషన్ రానున్న నేపథ్యంలో బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 26 జిల్లాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తామని చెప్పారు. మహిళలు, ఇతరుల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. సివిల్ సర్వీసెస్‌కు కోచింగ్ ఇప్పిస్తామన్నారు. టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీలను బడుగుబలహీన వర్గాలకు కేటాయించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీలపై జరిగిన దాడులపై మండిపడ్డారు. గత ప్రభుత్వంలో బీసీలు, ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, వేధించారన్నారు. 200 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారనీ, 2600 మందిపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ఒక్కచాన్స్ అంటూ బడుగుబలహీన వర్గాలతో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్ బీసీ బిడ్డలను అన్నివిధాలా అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు.

బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించండి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, మార్చి10(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం ఆమె మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు అధ్వానస్థితికి చేరాయన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు సరైన వసతులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47వేల కోట్లు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించిందన్నారు. గతంలో బీసీల విద్యార్థుల కోసం పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే రాప్తాడు నియోజకవర్గంలోని ననసకోటన మీపంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎంజేపీ బాలికల పాఠశాల నిర్మించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అయితే జిల్లాలోని బీసీ వసతిగృహాలు, ఎంజేపీ, మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతిగృహం, పేరూరు ఎంజేపీ బాలుర పాఠశాల, కనగానపల్లి మోడల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. వెనుకబడిన అనంత జిల్లాలో పేద విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. బీసీలకు ఇస్తున్న సబ్సిడీ రుణాల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. అసెంబ్లీలో తాను ప్రస్తావించిన అంశాలు సూటిగా, స్పష్టంగా ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారని ఆమె తెలిపారు.

కరెంటు చార్జీలు తగ్గించండి

- ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రి, మార్చి10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు బాగుపడాలంటే విద్యుత్ చార్జీలు తగ్గించి, రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట తాడిపత్రి నియోజకవర్గంలో సాగు, తాగునీరు ఇబ్బందిలేకుండా మంచి పంటలు పండేవన్నారు. కొంతకాలంగా సాగు, తాగునీరు లేకపోవడంతో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. కానీ ఈ ప్రాంతంలో రా మెటీరియల్ లేకపోయినా వందల కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చి గ్రానైట్, నల్లబండల పరిశ్రమలు స్థాపించి 30వేల నుంచి 40వేల వరకు కార్మికులకు ఉపాధి కల్పించేవారు అన్నారు. దాదాపు 1800 పరిశ్రమలు ఉండేవని వాటి వల్ల నియోజకవర్గంలోని ప్రజలు, వ్యాపారస్తులు బాగుండేవారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచడం, రాయితీలు తగ్గించడంతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీనివల్ల దాదాపు 20వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా కూడా ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.8 నుంచి 9వరకు ఉన్నాయని వాటిని రూ.2లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పరిశ్రమలశాఖ మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్మలను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు
వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు
స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

ఉపాధి మెరుగుపరచడమే ధ్యేయం

- దివ్యాంగులకు త్వరలోనే వడ్డీ రహిత రుణాలు
- ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జీవనోపాధులు మెరుగుపరచడమే ఐడియా(ఇన్‌క్లూజివ్ దివ్యాంగ్జమ్ ఎంటర్‌ప్రెన్యూర్), సక్షం స్వచ్ఛంద సంస్థల ధ్యేయమని ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్ అన్నారు. ఢిల్లీ నుంచి అనంతకు వచ్చిన సంస్థ ప్రతినిధులు వారం రోజులుగా దివ్యాంగుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆ సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ మాట్లాడుతూ.. ఐడియా సంస్థ చైర్మన్ ఐతా మల్లికార్జున అనంత జిల్లాలో విద్యనభ్యసించి ప్రొఫెసర్‌గా సేవలందించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఢిల్లీలో ఐడియా స్వచ్ఛంద సంస్థను స్థాపించి దివ్యాంగులకు సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో ఉన్న దివ్యాంగులకు జీవనోపాధి కలిగించాలనే ఉద్దేశ్యంతో వడ్డీ రహిత రుణాలు (రీఫండబుల్ సీడ్ మనీ) అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా నుంచి దాదాపు 39 మంది దివ్యాంగులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకూ కొవ్వూరునగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 15వ తేదీ శిక్షణ పొందిన వారికి ఈడీపీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం 15 రోజుల్లోపు ఎంపికైన దివ్యాంగులందరికి ఒక్కొక్కరికి రూ.22500 రుణాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సక్షం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, ఐడియా ఈడీపీ ట్రైనర్ వీరం మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోండి

- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపు కోసం వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచించారు. కరువు ప్రాంతాలలో భూగర్భ జలాల పరిస్థితులపై కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేయడంద్వారానే భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందని, కలెక్టర్లు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో భూగర్భ జలాలపెంపునకు తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు.

22న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఈ నెల 22న నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, వర్కులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. స్టాండింగ్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలుపుదల

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలిపివేసినట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 294 క్యూసెక్కులు వస్తుండగా, ప్రస్తుతం 1.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,350లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

ఈ-పంటలో ఉందా..?

- మీ పంట వివరాలు చూసుకోండి
- రైతుసేవా కేంద్రాల్లో వివరాలు

అనంతపురం అర్బన్/ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం సక్రమంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రబీ ఈ-పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తోంది. తద్వారా జాబితాలో పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా సరిచేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నెల 15వ తేదీ వరకూ జాబితా ప్రదర్శన ఉంటుంది. 20వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. తహసీల్దారు, వ్యవసాయశాఖ అధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు.

ఆర్ఎస్కేల్లో వివరాలు

సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో రబీ ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శనకు ఉంచామని అనంతపురం జేడీఏ ఉమామహేశ్వరమ్మ, శ్రీసత్యసాయి జిల్లా జేడీఏ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ నెల 15వతేదీ దాకా వివరాలను ప్రదర్శిస్తామని తెలిపారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఈ-పంటలో వివరాలు చదివి వినిపిస్తామని తెలిపారు. అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 83,451 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఈ-పంట నమోదు చేశామని ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మొత్తం 54,554 మంది రైతులకుగాను 51,716 మంది రైతుల ఈకేవైసీ (95 శాతం) పూర్తి అయిందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి మెడలో జంధ్యం ఉందని, వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. అతన్ని గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న గురవయ్యల నృత్యం


పాలు తాగే కార్యక్రమంలో గురవయ్యలు

ఉరవకొండ,మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఆలుమత కురుబ కులస్తుల ఆధ్వర్యంలో గురవయ్యలకు పాలు తాపే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి ప్రారంభించారు. గురవయ్యలు సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శివుడికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పాత్రల్లో పోసిన పాలను గురవయ్యలు తాగగా, వారి పాదాలకు నమస్కరించి భక్తులు ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ రాణి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కే.రాజేష్, కురుబ సంఘం నాయకులు చేజాల నాగరాజు, లాలెప్ప, గూలెప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా..

- జై జవాన్, జై కిసాన్ నినాదంతో అనంత యువకుడి పాదయాత్ర


పాదయాత్ర చేసిన ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జై జవాన్... జై కిసాన్ నినాదంతో అనంతపురం నగరానికి చెందిన యువకుడు ప్రదీప్‌కుమార్ అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా పాదయాత్ర చేశాడు. ఈ ఏడాది జనవరిలో పాదయాత్ర ఆరంభించి, రాష్ట్రంలోని పలు జిల్లాలమీదుగా పాకిస్తాన్ సరిహద్దు వరకు 2300 కిలో మీటర్లు పాదయాత్ర చేశాడు. ఈనెల ఐదో తేదీతో పాదయాత్రను పూర్తి చేసుకొని, తిరిగి అనంతకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంజీ కాలనీలో ఈడిగ సంఘం నాయకులు, ఈడిగ కులస్తులు వేణుగోపాల్ గౌడ్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గంగాధర్, రవి, గోపాల్ తదితరులు ప్రదీప్‌కుమార్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శివకుమార్, జగదీష్, అరుణ్, పవన్‌కుమార్, తరుణ్, కుమార్, నాగేంద్ర, ప్రకాష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారున్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 33 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాకు ఎంపికైన వారికి జీతం నెలకు రూ.13వేలు నుంచి రూ.20 వేలు ఇస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్, పెనుకొండ, పాలసముద్రంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పెట్రోల్ బంకు పేరుతో టోకరా..!

- రూ.61.50 లక్షలు కాజేసిన వైనం
- ఉద్యోగాలిప్పిస్తానని మరో రూ.20లక్షలు
- లోకేశ్, ఎమ్మెల్యేల పేరుతో బెదిరింపులు
- ఎస్పీకి దళితుల ఫిర్యాదు

అనంతపురం క్రైం,మార్చి 10(ఆంధ్రజ్యోతి): మీ భూమిలో పెట్రోలు బంకు పెడితే అద్భుతమైన లాభాలొస్తాయని నమ్మించి రూ.61.50లక్షలు టోకరా కొట్టాడు. పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి మరో రూ.20లక్షలు తీసేసుకున్నాడు. పెట్రోల్ పంపూ లేదు... పిల్లకు ఉద్యోగాలూ లేవు. నాలుగేళ్ల నుంచి ఇలా కథలు చెప్పుకుంటూ వస్తుంటే...నిలదీశారు. కానీ అతడు డబ్బు ఇవ్వలేదు. తనకు టీడీపీ నేతలు తెలుసని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ బెదిరిస్తున్నాడు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పెద్దసద్దానప్ప, చిన్న సద్దానప్ప, వన్నూరమ్మ ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. దళితులైన తమకు ఆశ చూపి, ఐదెకరాల భూమిలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన పడమల నాగేంద్ర అనే వ్యక్తి నమ్మించి రూ.61.50 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఫేక్ ఫర్మ్‌తో...పెట్రోల్ ట్యాంకులు, పెట్రోల్ పంప్ చేసే యంత్రాలను చూపించి డబ్బు విడతల వారిగా వసూలు చేశాడని వాపోయారు. తమ పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని ముగ్గురి నుంచి మరో రూ.21లక్షలు తీసుకున్నాడని వివరించారు. 2021లో ఈ డబ్బు తీసుకున్నాడని తెలిపారు. డబ్బు ఇవ్వమని అడిగితే... చంపడానికి ప్రయత్నించామని తమపైనే నాగేంద్ర అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించారని వాపోయారు. మానవ హక్కుల సంఘం పేరుతో భయపెడుతున్నాడని తెలిపారు. తనకు మంత్రి నారా లోకేశ్, టీడీపీ ఎమ్మెల్యేలు తెలుసని భయపెడుతున్నాడని ఆరోపించారు. నాగేంద్ర కొడుకు కూడా నేతల పేర్లు చెప్పి భయపెడుతున్నాడని తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా దిక్కులేదా..?

- బాధితురాలి ఆవేదన

నార్పల మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను వీధికి చెందిన తమ ఇంట్లో గత ఏడాది ఆగస్టు 25న దొంగతనం జరిగిందని... ఎస్పీ కార్యాలయంలో నాలుగుసార్లు, నార్పల పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత మహిళ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి ఆమె ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో ఏడు తులాల బంగారం, 15 తులాల వెండి చోరీ జరిగిందని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. నార్పల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని, దొంగలను వెతికే పనిలో ఉన్నామని చెప్పారని.. అర అంగులం కూడా ముందుకెళ్లలేదని వాపోయారు. దొంగతనం అనంతరం పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారని, అది అయ్యప్ప సప్లయర్స్ షాపు వరకు వెళ్లిందని, అక్కడ ఏం విచారణ జరిగిందో తెలియదన్నారు. పోలీస్ సిబ్బంది ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారని, కానీ ఏం విచారించారో తెలియదన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దళితులు

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 226972

అకౌంటెంట్ కావలెను
Tally Prime accounts, M.S ఆఫీస్ అనుభవం గల అకౌంటెంట్ కావలెను. జీతం 15,000 నుంచి 20,000 కలదు. శ్రీ శబరి ఆయిల్ ట్రేడర్స్, పాతవూరు, అనంతపురం. Cell:9705340666
AJA-BABA

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926
AJA-226965

ఉద్యోగ అవకాశము
ఆటో ఫైనాన్స్ నందు ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేయడానికి ఆసక్తిగల యువకుడు, మరియు టెలీకాలింగ్ కొరకు యువతి కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. సెల్ :7901271059
AJA-226910

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

పాండురంగస్వామి నిజపాద స్పర్శ దర్శనం



అనంతపురం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద స్పర్శ దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్లకు విశేష పూజలు చేశారు. భక్తులు విరివిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రస్తా సమస్యను పరిష్కరించండి

అనంతపురం రూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆలమూరు, కక్కలపల్లి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రస్తా సమస్యను పరిష్కరించాలని సంబంధిత గ్రామాల రైతులు కోరారు. టీడీపీ మండల సీనియర్ నాయకుడు ఆలమూరు సూరితో కలసి సోమవారం తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. రస్తా సమస్యను తహసీల్దార్‌కు, మండల సర్వేయర్ రఘుకు వివరించారు. ఆలమూరు సర్వే నంబర్లు 295,284,285,288,165,287లలోని భూముల్లో కక్కలపల్లి రోడ్డు నుంచి కాటిగానికాలువ వరకు పూర్వ కాలం నుంచి రస్తా ఉందన్నారు. అయితే సర్వే నంబర్లు 165,287,285ల్లోని భూముల రైతులు రోడ్డుకు అడ్డంగా కంచె వేశారన్నారు. తొలగించమంటే కేసుల పేరిట స్థానిక సర్వేయర్లను బెదిరిస్తున్నారన్నారు. రస్తా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ రోడ్డు గుండా ఆలమూరు ఎర్రకొండ హౌసింగ్ లేఅవుట్‌కు వెళ్లేందుకు అనువుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పొలాల రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

- జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య

అనంతపురం సెంట్రల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అభ్యసిస్తున్న విద్యార్థులు కొత్త స్టార్టప్‌లు నెలకొల్పి పలువురికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య సూచించారు. కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో సోమవారం ఎంటర్ ప్రెన్యూర్ షిప్, వెంచర్ క్రియేషన్ అనే అంశంపై ఐదురోజుల సెమినార్‌ను ఏర్పాటుచేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన వహించిన సెమినార్‌ను రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ప్రారంభించి మాట్లాడారు. డైరెక్టర్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ చిత్ర, ప్రొఫెసర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానం తీర్పు హర్షణీయం: సాకే హరి

అనంతపురం సెంట్రల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహం చేసుకున్నాడన్న కక్షతో ప్రణయ్‌ను హత్యచేసిన కేసులో న్యాయస్థానం వెలువరించిన తీర్పు హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. పరువు హత్యలు చేసేవారికి, చేయించే వారికి ఇదొక హెచ్చరిక లాంటిదని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న నేటి కాలంలోనూ పరువుపేరుతో కులాంతర పెళ్లిళ్లను వ్యతిరేకించడం దుర్మార్గమన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 13 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న శ్రీ బాలాజీ ఎంసీఏ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 13 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మన్మథేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం గ్రాస్ రూట్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్‌ఓపీ, ప్రాసెస్ అసోసియేట్ స్థానాలకు ప్రాంగాణ నియామకాలు చేపట్టారు. ఈ ఇంటర్వ్యూలకు 150మంది విద్యార్థులు హాజరు కాగా 13మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వారిని కళాశాల చైర్మన్ పల్లె కిశోర్ అభినందించారు. కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి కబీర్ బాషా, ఎంబీఏ విభాగాధిపతి సర్వరాజ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

- పోస్టర్లు విడుదల చేసిన శైలజానాథ్, తలారి రంగయ్య



పోస్టర్లు విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

శింగనమల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, యువత మోస పోతున్నారని, వారికి వైసీపీ అండగా నిలిచి పోరాటం చేస్తుందని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు సాకే శైలజానాథ్ అన్నారు. ఈనెల 12న నిర్వహించే యువత పోరు పోస్టర్లను సోమవారం మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ మంత్రి శైలజనాథ్, వైసీపీ నియోజక వర్గం సమయ్యయ కర్త ఎం.వీరాంజనేయులు విడుదల చేశారు. ఈ నెల 12న అనంతపురంలో చేపట్టే యువత పోరుకు నియో జకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, తరిమెల గోకుల్‌రెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యవసాయ సామగ్రి దగ్ధం

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నిల గ్రామంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల వ్యవసాయ సామగ్రి కాలి పోయింది. గ్రామానికి చెందిన రైతు రాంప్రసాద్ ఆరు ఎకరాలను లీజ్‌కు తీసుకుని అరటి సాగు చేశాడు. అలాగే తన రెండున్నర ఎకరాల్లో కర్బూజా సాగుకు అన్ని విధాల సిద్ధం చేసుకున్నాడు. ఈక్రమంలోనే పొలంలో ఉన్న గదిలో వివిధ రకాల వ్యవసాయ సామగ్రిని ఉంచాడు. అందులో కరెంటు స్టార్టర్ పెట్టెలు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం కరెంటు ఒక్కసారిగా రావడంతో ఓ స్టార్టర్ పెట్టెలో విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగింది. దీంతో గదిలో ఉన్న రెండు స్టార్టర్ పెట్టెలు, నాలుగు మూటల డ్రిప్పు మందు, కొత్త విద్యుత్ లైన్ లాగేందుకు ఉంచిన వైరు, కర్బూజా సాగుకోసం తెచ్చిన 12కట్టల మల్చింగ్ పేపర్, మందు, పిచికారి పంపు, డ్రిప్పు కట్టలు తదితర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో దాదాపు రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

హిందువులపై దాడులను ఉపేక్షించం



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

- ఎస్ఐ నరసింహారెడ్డి, ఈఓ రమణారెడ్డిని డిస్మిస్ చేయాలి
- రాయచోటి ఘటనపై డిప్యూటీ సీఎం స్పందించాలి
- విశ్వహిందూ పరిషత్ నిరసన ర్యాలీలో వక్తలు

అనంతపురం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హిందువులపై ఎక్కడ దాడి జరిగినా విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఇక ఉపేక్షించదని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఊరేగింపులో హిందువులపై ముస్లింల దాడిని నిరసిస్తూ సోమవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా వందలాదిమందితో కృష్ణ కళామందిర్ నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిరసన ర్యాలీలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకట రత్నమయ్య, బజరంగదళ్ దక్షిణాంధ్ర సహాయ సంయోజక్ రవి, బీజేపీ నాయకులు కొనకొండ్ల రాజేష్, సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 4న రాయ చోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో హిందువులపై అన్యమతస్థుల దాడి హిందూ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. రథోత్సవమంటేనే మేళతాలాలు, ఊరేగింపులతో జరిగే కార్యక్రమమని, అలాంటి కార్యక్రమాలకు అడ్డు తగిలి దాడి చేసి హిందువులను భయ భ్రాంతులకు గురిచేయడం దురదృష్టకరమన్నారు. అక్కడున్న పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడమే కాకుండా హిందువులపైనే కేసులు నమోదు చేసి, అన్యమతస్థులను మాత్రం నామమాత్రపు కేసులతో విడుదల చేశారన్నారు. ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ నరసింహారెడ్డి, వీరభద్రస్వామి ఆలయ ఈఓ రమణారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాయచోటి ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని, హిందువులకు న్యాయం చేసి హిందూ సమాజ భద్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఓలేటి రత్నమయ్య, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణబాబు, కార్యదర్శి విశ్వనాతరెడ్డి, సహాయ కార్యదర్శి కిషోర్ నాయుడు, బజరగందళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, ఆలం నరసానాయుడు

బుక్కరాయసముద్రం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ శింగనమల నియోజక వర్గం నాయకులు పుట్టపర్తి విమానశ్రాయం లో కలిసి ఘనస్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వీరితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సీఎంను కలిసిన జేఎన్టీయూ వీసీ



అనంతపురం సెంట్రల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రెటరియేట్‌కు వెళ్లిన సంద ర్భంగా అసెంబ్లీకి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశానన్నారు. వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు. పరిశోధనలు, ప్రాజెక్టులతో పాటు వర్సిటీ స్వయం ప్రతిపత్తితో ఆర్థిక వనరుల సమకూర్చే అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

- టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య



మీడియాతో మాట్లాడుతున్న ఆవుల కృష్ణయ్య

అనంతపురం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేస్తోందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ నాయకులు చంద్రాయుడుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. వైసీపీ పాలనలో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని మండిపడ్డారు. దేశంలోనే తొలి సారిగా కూటమి ప్రభుత్వం బీసీల రక్షణ చట్టం తీసుకొస్తున్నందుకు బీసీలంతా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ.... ఫీజు పోరు పేరుతో వైసీపీ చేస్తున్న డ్రామాను విద్యార్థులు గమనిస్తున్నారన్నారు. నగర సమీపంలోని డంపింగ్ యార్డు తరలింపుతో పాటు నడిమి వంక, మరువ వంకల ప్రొటెక్షన్ వాల్స్ ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అసెంబ్లీలో ప్రస్తావించడాన్ని నగర ప్రజలంతా స్వాగతిస్తున్నారన్నారు. నగర అభివృద్ధికి ఎమ్మెల్యే పాటుపడుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

వైసీపీ కుట్రలను బద్దలు కొడతాం : సిమెంట్ పోలన్న

అనంతపురం అర్బన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు, కుట్రలను బద్దలు కొడతామని టీడీపీ నాయకుడు సిమెంట్ పోలన్న హెచ్చరించారు. ఆయన సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ అనంతపురం అర్బన్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలనే కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఎమ్మెల్సీ పదవులు బీసీలకు ఇవ్వడం హర్షణీయం

బుక్కరాయసముద్రం, మార్చి10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ పదవులు బీసీలకు ఇవ్వడం హర్షణీయమని తెలుగుయువత నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి నరేంద్రయాదవ్, బీసీ సంఘం నేతలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో వారు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ బీసీలకు పెద్ద పీట వేస్తోందని చెప్పడానికి ఎమ్మెల్సీల కేటాయింపే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లక్ష్మీనారాయయాదవ్, ఆదియాదవ్, బొజ్జయ్య, రామకృష్ణరాజు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాలివ్వకుంటే ఎలా?

- కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

అనంతపురం విద్య, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాల్వికుంటే ఎలా బతికే దని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్లు, ఏఐటీయూసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తమ సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ నాయకులు చింరజీవి, మనోహర్, వెంకటేష్ మాట్లాడుతూ... తమకు నాలుగు నెలలు నుంచి జీతాలు పెండింగ్‌లో ఉంచారన్నారు. ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని కాం ట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో, మెడికల్ కాలేజి, సూపర్ హాస్పెటల్‌లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల సమస్యలను సైతం పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు.

రూ. 135 కోట్లతో బడ్జెట్ ఆమోదం

- చప్పగా ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశం



పాల్గొన్న మేయర్ వసీం, అధికారులు

అనంతపురం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 135కోట్లతో బడ్జెట్ కు స్టాండింగ్ కమిటీలో ఆమోదం తెలిపారు. మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన సోమవారం మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ సమా వేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. నగరంలో చెత్తను తరలించేందుకు 30 అద్దె ట్రాక్టర్ల ఏర్పాటుకు, శ్రీనగర్ కాలనీ, కోవూరునగర్, సాయినగర్‌లలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కాగా సమావేశం చప్పగా సాగింది. సభ్యుల నుంచి సమస్యలపై ఎలాంటి ప్రశ్నల్లేకుండానే సమావేశం ముగిసింది. కేవలం 40 నిమిషాల్లోనే మమ అనిపించారు. తమ ప్రాంతంలోనూ కాలువల్లో పూడిక తీయాలని సభ్యురాలు వినూత్న కోరారు. క్యాన్సిల్ అయిన పనులను పెట్టవచ్చు కదా అని సభ్యుడు అనిల్, తమ డివిజన్ లో కాలువలు, రోడ్లు లేవని, అరకొరగా పించన్లు తీసేశారని రహంతుల్లా స్థానిక సమస్యలపై చెప్పుకొచ్చారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం తగదు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

అనంతపురం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చాలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధిం చడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ సోమవారం అంగన్‌డీలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో క్లాక్‌టవర్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో దాదాపు అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... 42 రోజుల చారిత్రక అంగన్వాడీల సమ్మె సందర్భంగా అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి పలు హామీల అమలుకు కట్టుబడి ఉండాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నీల రామాంజినేయులు, కార్యదర్శులు ముత్తుజా, వెంకటనా రాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణమ్మ, నక్షత్ర, రేవతి, పార్వతి, పద్మ, జ్యోతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నార్పల: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నార్పల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ యూనియన్ నార్పల ప్రాజెక్టులో కార్యకర్తలు నిరసన తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడ లో చేపట్టిన మహా ధర్నాకు సంఘీభావం తెలిపామన్నారు. సెక్టార్ లీడర్లు రేణుకాదేవి, సుధామణి, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాడు శింగనమల గోల్కొండ శ్మశాన వాటిక దుస్థితి



కంపచెట్లు తొలగించాక నేడు ఇలా...

శ్మశాన వాటికలో సమస్యలు మాయం

- ఎమ్మెల్యే చొరవతో కంపచెట్ల తొలగింపు

శింగనమల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో శ్మశాన వాటికల్లో ఎక్కడ చూసినా కంపచేట్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లో శ్మశాన వాటికల్లో కంపచెట్లను తొలగించారు. మృతదేహాలను పూడ్చడానికి ఎలాంటి సమస్యలు లేకుండా చేశారు. నియోజకవర్గం కేంద్రమై శింగనమలలోని గోల్కొండ శ్మశాన వాటికలో గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ కంపచెట్లు తొలగించిన దాఖలాలు లేవు. దీంతో శ్మశానంలో మృతహాలను పూడ్చడానికి బంధువులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. పైగా ఒక మృతదేహం ఉన్న గుంతలోనే మరొకటి పూడ్చాల్సిన పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం రాగానే గ్రామంలోని యువకులు, గ్రామస్థులు శ్మశాన వాటిక దుస్థితిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. అమె చొరవ చూపి శ్మశానంలోని కంపచెట్లను తొలగించారు. శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేసినట్లు తెలపడంతో వెంటనే రెవెన్యూ అధికారుల ద్వారా స్థలాన్ని సర్వే చేయించారు. కబ్జా అయిన భూమిని అధికారులు చూపారు. శ్మశానానికి హద్దు చూపడంతో ప్రహరీ నిర్మించి, బోరు వేసి, నీటి తొట్టెలు ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే చొరవ చూపుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రమాదకరంగా...



శింగనమల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పొలంలోని ట్రాన్స్ ఫార్మర్‌తో పాటు విద్యుత్‌స్తంభం పై వరకు చెట్ల తీగలు అల్లుకున్నాయి. దీంతో ఏ నిమిషంలో ప్రమాదం జరుగుతుందోనని రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉల్లికల్లు గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పొలంలో ఇది కనిపిస్తుంది. వర్షాకాలంలో బాగా ఏపుగా పెరిగిన చెట్లతీగలు, ఇప్పుడు వేసవి సమీపిస్తుండడంతో ఎండుముఖం పట్టి ఇంకా ప్రమాదకరంగా మారాయని రైతులంటున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

విభాగాల పనితీరు మెరుగు బాధ్యత మీదే

- హెచ్‌ఓడీలకు సూపరింటెండెంట్ ఆదేశాలు

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సంబంధిత డిపార్ట్‌మెంట్‌ల పనితీరు మెరుగు పరచడంలో ఆయా విభాగాల హెచ్‌ఓడీలే బాధ్యత తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వర రావు సూచించారు. ఆయన సోమవారం త చాంబర్‌లో హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వేలో ఆస్పత్రి పనితీరు పట్ల రోగులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పని తీరు మెరుగు పరచుకోవాలన్నారు. అలాగే సూపర్‌స్పెషాలిటీలో క్యాజు వాలిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, ఆ పనులను త్వరగా పూర్తిచేసేందుకు సహకరించాలని హెచ్‌ఓడీలకు సూపరింటెండెంట్ సూచించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టరు పద్మజ, హెచ్‌ఓడీలు భీమ సేనాచారి, ఆత్మారామ్ శ్రీనివాసులు, రామస్వామి, రామస్వామినాయక్, రాజేష్, షంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అతిగా తినడంతోనే ఓబులేసు మృతి..?

అనంతపురం క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని శవంగా కనిపించిన జూటూరు ఓబులేసు మద్యం తాగిన అనంతరం అతిగా తినడం కారణంగానే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. శనివారం రాత్రి పాతూర్లో బ్రహ్మంగారి గుడి వద్ద ఓబుళేసు మృతదేహం కనిపించింది. ఆదివారం కుటుంబసభ్యులు అతడి మృతదేహాన్ని గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులు సోమవారం పోస్టుమార్టం చేయించారు. అతిగా తినడం వల్ల గుడ్డులోని తెల్లప దార్థం గొంతులోనే ఉండిపోయి ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు పోస్టుమార్టం రిపోర్టులో నిర్ధారించారు. గుండెపోటు కూడా వచ్చి ఉండవచ్చని వైద్యులు చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఓబులేసు చొక్కా, పంచె ఎక్కడికెళ్లాయనేది అంతుబట్టడం లేదు. ఈ విషయంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఓ వృద్ధుడితో కలిసి గుత్తిరోడ్డులో మద్యం తాగేందుకు వెళ్లాడని, ఆ తరువాత తిన్నాడని పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. ఆ తరువాత ఏం జరిగి ఉంటుందోననే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు అనంతపురం మహిళా పోలీసు స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌లో సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలుగులో రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎండీ షఫీ, ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, లీగల్ సలహాదారుడు జెన్నే ఆనంద్, కార్యదర్శి రసూల్‌తో కలిసి సీఐ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు ఈశ్వర్, లక్ష్మీదేవి, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయకండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ

రామగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కర్రెన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు వారివారి ప్రగతి నివేదికలు వివరించిన అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ... మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడిపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య ఉత్పన్నమైన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. వేసవిలో వచ్చే జబ్బులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో ఈఓఆర్‌డీ కమలాబాయి, ఏఓ ప్రసాద్, వైస్ ఎంపీపీ సంపత్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో తప్పులుంటే తెలపండి: ఏఓ

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ఈ-పంట నమోదు చేశారని అందుకు సంబంధించిన జాబితా గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లోని నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ఏఓ శశికళ తెలిపారు. అందులో ఏవైనా తప్పులుంటే ఈ నెల 15లోగా రైతు సేవా కేంద్రాల్లో అభ్యంతరాలు తెలియజేయాలని ఆమె రైతులకు సూచించారు. సోమవారం మండల ఏఓ కార్యాలయంలో ఆమె ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.



సంక్షిప్త వార్తలు

అభివృద్ధి ఏంటో చూపిస్తాం: జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

పుట్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన తెలుగుయువత ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ రెడ్డి తల్లి అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి రావడంతో జేసీపీఆర్ ఆమెను సోమవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తాడిపత్రిలో పాలనను ఇప్పటికే గాడినపెట్టామన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేసిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాగునీటి కోసం రెండు బోర్లు

విడపనకల్లు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు తాగు నీటి కోసం రెండు బోర్లను వేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు గ్రామంలోని సొసైటీ గోడౌన్ వద్ద ఒక బోరు, భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మరొకబోరు వేయించామన్నారు. ఈ రెండు బోర్లలో నీళ్లు పడ్డాయని, ఇక గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

చెరువులను నింపిన ఘనత కేశవ్‌దే: టీడీపీ

ఉరవకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని చెరువులను నింపిన ఘనత మంత్రి పయ్యావుల కేశవ్‌దేనని టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాలోని చెరువుకు హంద్రీనీవా నీటిని మళ్లించేందుకు గాను సోమవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెంకటాంపల్లి పెద్దతండా చెరువుకు హంద్రీనీవా జలాలను తరలించే విషయంపై మంత్రితో చర్చించి కార్యరూపం అయ్యేలా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తులసీదాస్ నాయక్, టీడీపీ నాయకులు సుధాకర్, ఎర్రిస్వామి, వెంకటేష్ నాయక్, గోపాల్ నాయక్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుల పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు

గుత్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛాంధ్ర అంటూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్ నుంచి మనోసత్రం, కోట ప్రాంతం వరకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు దుకాణాలలో సోదాలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రూ.2200లు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగాలు జరిపితే మున్సిపల్ చట్టప్రకారం షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

యాడికి, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఒక మహిళ అదృశ్యమైనట్లు ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణయ్య తెలిపారు. స్థానిక అంకాలమ్మవీధికి చెందిన మహిళ సోమవారం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఆచూకీ తెలియరాలేదన్నారు. ఈ మేరకు ఆమె భర్త ఫిర్యాదు ఇచ్చారని, ఆ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి: సీపీఐ

గుంతకల్లు, మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు మురికివాడలు, శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట సోమవారం వారు ఆయా కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్రస్వామి మాట్లాడుతూ.. పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీరు, డ్రెయిన్, రహదారి, వీధి దీపాల వసతి లేని కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. శ్రీలంక కొట్టాల, దోనిముక్కల రోడ్డు, ఇందిరమ్మ కాలనీలు, సంతోష్‌నగర్, పోర్టర్సు లైన్, షికారి కాలనీ, కుమ్మరి వీధి, 26వ వార్డులో ఈ సమస్యలు అధికంగా నెలకొని ఉన్నాయని తెలియజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మునిసిపల్ కమిషనరు నయ్యీం అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మహేశ్, గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాయల్ రాము, దేవేంద్రప్ప, శివానంద, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని జడ్‌వీరా రెడ్డి కాలనీలో మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సీపీఎం నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మెయిన్ రోడ్డు నుంచి కాలనీ వరకు రోడ్డును వేయాలని, విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియాకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నిర్మల, మల్లికార్జున, వెంకటలక్ష్మి, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కట్..కటా..!

- మరమ్మతుల పేరుతో రోజూ పవర్‌కట్
- అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి

యాడికి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల పేరుతో అనధికారికంగా విధిస్తున్న కరెంట్ కోతలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 15 రోజుల నుంచి మండలంలో తరచుగా కరెంట్ కోతలు విధిస్తున్నారు. స్థానికంగా కరెంట్ స్తంభాల మార్పిడి అంటూ కొద్దిరోజులు, సబ్‌స్టేషన్లలో మరమ్మతులు అంటూ మరికొద్దిరోజులు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అసలే వేసవి మొదలైంది, ఆపై కరెంట్‌కోతలు అధికమవడంతో.. ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతులు అంటూ ఉదయం 6గంటలకు కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నారు. మధ్యాహ్నం 1గంటకు తిరిగి సరఫరా చేస్తున్నారు. కరెంట్ లేని సమయంలో ఎండకు బయట తిరగలేక, ఉక్కబోతకు ఇంటిలో ఉండలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని గందరగోళం నెలకొని ఉంది. కరెంట్ కోతలపై ట్రాన్స్‌కో అధికారులు స్పష్టత ఇవ్వాలని మండలవాసులు కోరుతున్నారు. వ్యవసాయానికి సరఫరా అయ్యే కరెంట్ పరిస్థితి కూడా ఇలాగే ఉందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి నిరంతరంగా 9గంటలు కరెంట్ ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. స్థానిక ట్రాన్స్‌కో అధికారులు ఆ నిబంధనలను అమలు చేయడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

వేసవిరాకనే ఇలా.....

వేసవి రాక మునుపే కరెంట్ కోతలు ఇంత ఎక్కువగా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటాయోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. కరెంట్ కోతలు విధించడంలో నిర్దిష్ట సమయపాలన పాటించాలని కోరుతున్నారు. కరెంట్ కోతల సమయాన్ని ముందే ప్రకటిస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చునని, అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని అంటున్నారు.

స్థానిక సమస్యలతోనే అంతరాయం..

అప్రకటిత విద్యుత్‌కోతలు ఏమి లేవు. స్థానిక సమస్యల కారణంగానే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. యాడికిలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు ఉండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. పనులు పూర్తయితే విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం ఏర్పడదు. అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు సిబ్బంది అంతా కృషిచేస్తున్నారు.

- రాజారావు, ట్రాన్స్‌కో ఏఈ

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా


గుంతకల్లులోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులులేక ఖాళీగా ఉన్న కుర్చీలు


తాడిపత్రిలో హాజరైన ముగ్గురు అధికారులు

గుంతకల్లుటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇద్దరు, ఎంఈఓ, పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. వ్యవసాయాధికారి మాత్రమే ఉన్నారు. మండల వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందనకు వచ్చారు. కాగా అధికారులు కనిపించకపోవడంతో నిరాశతో వెనుదిరి గి వెళ్లిపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ రమాదేవి వివరణ కోరగా ఐదుగురు అధికారులు వచ్చి హాజరు పుస్తకంలో సంతకాలు పెట్టి వెళ్లిపోయారని, మిగిలిన అధికారులు ఎందుకు రాలేదో తెలియదని, వీఆర్వో ద్వారా ఫోన్ చేసి తెలుసుకుంటానని చెప్పారు.

తాడిపత్రిలో ముగ్గురే హాజరు..

తాడిపత్రి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కేవలం ముగ్గురు అధికారులే హాజరయ్యారు. ఉదయం 11:30గంటలైనా తహసీల్దార్ రజాక్‌వలి, ఇద్దరు వీఆర్వోలు తప్ప ఎవరూ హాజరుకాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు అధికారులు లేనిది చూసి నిరుత్సాహంతో వెనుదిరిగారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పీడబ్ల్యూడీ కార్యాలయ ఆవరణలోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు న్యాక్ ఏడీ గోవిందరాజులు, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తయి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

ఉరవకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికుడే అయిన కార్తీక్ తన స్నేహితుడు నందకుమార్‌తో కలిసి బైక్‌పై అనంతపురం వైపునకు బయలుదేరాడు. అయితే అగ్నిమాపకం కేంద్రం సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కార్తీక్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులకు గాయాలు..

గుత్తి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులో గల 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు నగరానికి చెందిన మెహన్‌గురుసాయి, మౌనిక దంపతులు సోమవారం కారులో బెంగళూరుకు బయలుదేరారు. అయితే కొత్తపేట గ్రామశివారులోకి రాగానే ప్రమాదవశాత్తూ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి..

బ్రహ్మసముద్రం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెంచిరెడ్డిపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ప్రశాంత్ గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామంలో బీపీఎంగా పనిచేస్తున్నాడు. కాగా విధులనిమిత్తం సోమవారం బైకుపై వెళుతుండగా.. గెంచిరెడ్డిపల్లి వద్ద నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవ అనే వ్యక్తి మరో బైక్‌లో ఎదురుగా వేగంగా వచ్చాడు. దీంతో రెండు బైక్‌లు ప్రమాదవశాత్తూ పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోబోల్తా పడి వృద్ధురాలికి..

పెద్దవడుగూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిమాకులపల్లి గ్రామసమీపంలో సోమవారం ఆటోబోల్తాపడి చింతలచెరువుకు చెందిన వృద్ధురాలు దాసరి పుల్లమ్మకు తీవ్రగాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

పట్టుబడిన మద్యంపై ఆరా

పుట్లూరు, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామశివార్లలో రెండురోజులక్రితం అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్‌చేసిన విషయం విదితమే. కానీ సీజ్ చేసిన మొత్తం 144మద్యం బాటిళ్లకు గాను కేవలం 52బాటిళ్లను మాత్రమే కేసులో చూపించడంతో పోలీసు ఉన్నతాధికారులు ఆరాతీసినట్లు సమాచారం. ముందుగా మద్యంబాటిళ్లను పట్టుకున్న ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను విచారించినట్లు తెలుస్తోంది. ఎక్కువ మద్యంబాటిళ్లను సీజ్‌చేసి తక్కువ చూపించడం వెనుక అంతర్యమేమిటని ఉన్నతాధికారులు ఆరాతీసినట్లు తెలిసింది.

నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు

రాయదుర్గంరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన భరత్ అనే యువకుడు కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసును నమోదు చేశామని సోమవారం సీఐ జయనాయక్ తెలిపారు. అయితే పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు భరత్‌ను తీసుకెళ్లి కొట్టడంతో అవమానం భరించలేక కర్ణాటకలోని ప్రాంతంలోని కానావసళ్లికి వెళ్లిపోయాడు. పోలీసులు కేసును చే ధించి విచారించగా పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు కొట్టినట్లు బాధితుడు తెలిపాడన్నారు. బాధితుడి వివరాల మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నంబర్లు లేని వాహనాలను సీజ్ చేస్తాం: సీఐ

తాడిపత్రి, మార్చి10(ఆంధ్రజ్యోతి): నంబర్ లేని వాహనాలను సీజ్ చేస్తామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో సూచించారు. ప్రతి వాహనానికి నెంబర్లు కనిపించేవిధంగా ఉండాలన్నారు. నెంబరుప్లేటు మీద ఎలాంటి ఫోటోలు ఉండరాదని సూచించారు.

ఉత్సాహంగా ఇరుసు ఎత్తుపోటీలు


ఇరుసు ఎత్తుతున్న క్రీడాకారుడు

యాడికి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రామీణ క్రీడ అయిన ఇరుసు ఎత్తు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. 16మంది క్రీడాకారులు ఇరుసు ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను తిలకించడానికి గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉరకలెత్తేలా కొనసాగిన పోటీల్లో మొదటి బహుమతిని వీరేష్ (తిమ్మాపురం), రెండో బహుమతిని నరేష్ (వంకరాజుకాల్వ), మూడో బహుమతిని నరేంద్ర(నాగలాపురం) గెలుపొందారు. విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

నీటికుంటల పనులు త్వరగా పూర్తి చేయాలి

రాయదుర్గం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు కలిసికట్టుగా పని చేయాలని ఎంపీడీఓ కొండన్న సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫారంపండ్ పనులను ప్రతి పంచాయతీలో వెంటనే ప్రారంభించి ఈ నెలాఖరులోగానే పూర్తి చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గోకులం షెడ్ల పనులను కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈసీ భారతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే విద్యార్థులతో ధర్నా: టీడీపీ

బొమ్మనహాళ్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండూరు గ్రామానికి చెందిన విద్యార్థులతో వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే రోడ్డుపై కూర్చోబెట్టించి కొద్దిసేపు ఆందోళన చేయించారని టీడీపీ నాయకులు అప్పారావు, గోవిందు, ఎర్రితాత, నాగరాజు, సంజప్ప వాపోయారు. బండూరు, ఉద్దేహాళ్ గ్రామాల మధ్య రోడ్డు వేయాలని సోమవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. దీంతో టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్న సమయంలో మట్టి రోడ్డు వేయించారని గుర్తు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలోనే ఎలాంటి రోడ్డు వేయలేదని అన్నారు. ఆటోలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులను కొందరు వైసీపీ నాయకులు కిందకి దించి కొద్దిసేపు రోడ్డుపై కూర్చోబెట్టి ధర్నా చేసినట్లు ఫొటోలు తీయించారని విమర్శించారు. విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాలతో అధికారులు ఇప్పటికే ఇక్కడ బీటీ రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపించారని తెలిపారు.

మధ్యాహ్నభోజనం పరిశీలన

బొమ్మనహాళ్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. అక్కడ రెండు పాత్రల్లో అన్నం వండడాన్ని గుర్తించిన వారు వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. ఒక పాత్రలో వండినది ఉపాధ్యాయులుకని, మరో పాత్రలో ఉన్న అన్నం విద్యార్థులకు అని తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఏదైతే తింటారో విద్యార్థులు అదే భోజనాన్ని తినాలని తెలిపారు. విద్యార్థులకు ఒక రకంగా.. ఉపాధ్యాయులకు ఒకరకంగా వండరాదని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల, కణేకల్లు మండల అధ్యక్షుడు ఫకృద్దీన్, కార్యదర్శి మహేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాల వెల్లువ

కూడేరు, మార్చి 10, (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వరస్వామి నూతన రథం తయారీకి సోమవారం స్థానికులైన పలువురు దాతలు విరాళాలను అందజేశారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం వారు రూ.2 లక్షలు, నేసే వెంకటేశులు రూ.50,116, లక్ష్మినరసప్ప రూ.50,116, గంపన్న వారి సంగప్ప రూ.50,116, ఎద్దుల ఈశ్వరయ్య రూ. 25,116, ఎడమల రామాంజనేయులు రూ. 5,116, కడదరకుంట ఈశ్వరయ్య రూ. 5,116 నగదును రథం అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులకు అందజేశారు.

సెక్టార్ మీటింగ్ వెలవెల


మీటింగ్‌కు హాజరైన ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లు

యాడికి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్ల సెక్టార్ మీటింగ్‌కు కేవలం ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో మీటింగ్ వెలవెలబోయింది. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు అంగన్‌వాడీ వర్కర్లు తరలివెళ్లారు. అంగన్‌వాడీ వర్కర్లు మహాధర్నాకు వెళ్లకుండా ఉన్నతాధికారులు సెక్టార్ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఎవరికీ సెలవు లేదని కూడా తెలిపారు. చెప్పిన ప్రకారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. అయితే యాడికిలో నిర్వహించిన మీటింగ్‌కు కేవలం ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లు మాత్రమే హాజరయ్యారు. కాగా మిగిలిన వారంతా మహాధర్నాకు వెళుతున్నామని చెప్పి ఇళ్లవద్దనే ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారిని వివరణ కోరగా సీడీపీఓ ఆదేశాల మేరకు సెక్టార్ మీటింగ్ నిర్వహించామని, అంగన్‌వాడీ వర్కర్లు ఇద్దరు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఇదే నివేదికను అధికారులకు తెలియజేయనున్నట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి శిక్షణ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపారాలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన, శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అలాగే బిజినెస్ చేసుకోవడానికి బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

లెప్రసీ కాలనీలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

కూడేరు, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామసమీపంలో గల లెప్రసీ కాలనీలో సోమవారం అసిస్టెంట్ కలెక్టర్, ట్రైనీ తహసీల్దార్ వినూత్న పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ అనప జేమ్స్, డీఎన్‌ఎంఓ గంగాధర్‌రెడ్డి, పీఎంఓ నాగన్న పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద సోమవారం మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి యువత పోరు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి అందలేదన్నారు. ఇందుకు నిరసనగా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఈనెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో యువత పోరు జరగనుందన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిరండి

గుంతకల్లుటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12వ తేదీ విజయవాడలో మహాధర్నా జరగనుందని, ఉపాధి హామీ కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీ.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని జీ కొట్టాల గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600లు ఇవ్వాలని, పనిదినాలు పెంచాలని, పనిముట్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్లతో మహాధర్నా జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లంకాదహనం


ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం లంకాదహనం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని లంకాదహనం ఎదుట ఉంచి పెద్దసంఖ్యలో బాణాసంచా కాల్చారు. మిరుమిట్లు గొలిపే కాంతులు భక్తులను అబ్బురపరిచాయి. తర్వాత అశ్వావాహనంపై చంద్రమౌళీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తిని అశ్వవాహనంపై కొలువుదీర్చి గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయకమిషనర్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

తాడిపత్రి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం వివిధ పూజలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని అర్చనలు చేయించారు.

ఘనంగా పెద్దకదిరప్ప స్వామి ఊరేగింపు


ఎర్రగుడిలో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

గుత్తిరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడ్డి, అనగానిదొడ్డి, అబ్బేదొడ్డి, ఎర్రగుడి గ్రామాల్లో పెద్దకదిరప్ప స్వామి ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతిఏడాది మార్చిలో ఆనవాయితీగా గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లోని 35 గ్రామాల్లో పెద్దకదిరెప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని 25 రోజుల పాటు పల్లకిలో మేళాతాళల మధ్య ఊరేగిస్తారు. గ్రామాల్లో పంటలు బాగా పండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ స్వామి వారిని ఊరేగిస్తామని అర్చకులు రామాంజునేయులు, కార్తీక్ తెలిపారు. ఇలా ఊరేగింపు చేస్తూ ఉగాది రోజున వెంకటాంపల్లి గ్రామ శివారులోని కొండకు స్వామివారిని చేరుస్తామని వారు పేర్కొన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవస్వామి


శేషవాహనంపై దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

యాడికి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివలక్ష్మి చెన్నకేశవస్వామి వారు బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత రాత్రి భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తు న తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు హరికృష్ణశర్మ, పవన్‌కుమార్ శర్మ, బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

శెట్టూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొచ్చుపల్లి గ్రామంలో సోమవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో అర్చకులు ఉదయమే మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవ విగ్రహన్ని కొలువుదీర్చి అశేష భక్తజనం మధ్యన పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పూర్ణ కుంభాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జలధి

శెట్టూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో సోమవారం మారెమ్మ దేవత జలధిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సమీపంలోని నోముగడ్డ వంక వద్ద జలధిని నిర్వహించారు. తర్వాత అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామపెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పురాతన ఆలయానికి మరమ్మతులు

కుందుర్పి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలయనూరు గ్రామంలో గల పంచలింగాల ఆలయానికి సోమవారం గ్రామస్థులు మరమ్మతులు చేపట్టారు. పురాతనమైన ఈ ఆలయం కళా సంపదకు ప్రసిద్ధి గాంచినదిగా గుర్తింపు పొందింది. అయితే కొన్నేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోడంతో పాడుబడింది. కొందరు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టి మరింత శిథిలం చేశారు. దీనికితోడు కంపచెట్లు పెరిగి అపరిశుభ్రతతో నిండిపోయింది. ఎవరో వస్తారు. ఏదో చేస్తారని కాకుండా.. చివరికి గ్రామస్థులే ఆలయ మరమ్మతులకు పూనుకున్నారు. కర్ణాటక భక్తులు, దాతల సహకారంతో ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని పలువురు తెలిపారు.

విఠోబా ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో విఠోబాస్వామి

పామిడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రంగుసుబే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారిమూలవిరాట్‌కు వేకువజామునే అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ సమేత విఠోబ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.